**Andhra Jyothi**

# వయోపరిమితి పెంచండి

- **లేకపోతే నోటిఫికేషన్లకు అవకాశం కోల్పోతాం**
- **సీఎం వద్ద పెండింగ్‌లో ఫైలు.. నిరుద్యోగుల ఎదురుచూపులు**

హైదరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ)తో పాటు రాష్ట్రంలోని వివిధ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీల నుంచి నోటిఫికేషన్లు త్వరలో విడుదలకానున్నాయి! ఈ నేపథ్యంలో గరిష్ఠ వయోపరిమితి పెంచాలని ప్రభుత్వాన్ని నిరుద్యోగులు కోరుతున్నారు. లేనిపక్షంలో ఇన్నాళ్ల శ్రమ వృథా అవుతుందని వాపోతున్నారు! ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రాగానే గరిష్ఠ వయోపరిమితిని 34 నుంచి 40ఏళ్లకు పెంచుతూ 2014, సెప్టెంబరు 23న ఉత్తర్వులు జారీచేసింది. దీని కాలపరిమితి రెండేళ్లుగా నిర్ధారించింది! అంటే ఇది ఈ నెల 23తో ముగిసిపోనుంది. ప్రభుత్వం భారీగా కొలువుల భర్తీకి సిద్ధమవుతోంది. దీంతో 39, 40ఏళ్లగల అభ్యర్థులు నోటిఫికేషన్ల కోసం సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వం గరిష్ఠ పరిమితి ఉత్తర్వులు పెంచుతూ జీవో ఇచ్చినా అది 40 ఏళ్లకే వర్తిస్తుంది. ఫలితంగా వేలాది మంది నిరుద్యోగులు కొత్త నోటిఫికేషన్లకు దూరమయ్యే పరిస్థితి. దీంతో ఇప్పటివరకూ తాము పడిన శ్రమ అంతా వ్యర్థమవుతుందని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కనుక 42ఏళ్లకు వయోపరిమితిని సడలించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా వయోపరిమితిని 45 ఏళ్లకు పెంచాలని కొంతమంది అభ్యర్థులు కోరారు. ఇందుకు సంబంధించిన ఫైలు సీఎం చంద్రబాబు వద్ద పెండింగ్‌లో ఉంది. గరిష్ఠ వయోపరిమితి పెంచడం వల్ల నిరుద్యోగ అభ్యర్థులకు, సమాజానికి, ప్రభుత్వానికి మేలు జరుగుతుందన్న అభిప్రాయాలు ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చేది మార్కుల సడలింపు కాదు, క్వాలిఫికేషన్ల సడలింపు కాదు, కేవలం వయోపరిమితి సడలింపు మాత్రమే అని నిరుద్యోగులు అభిప్రాయపడుతున్నారు. పాశ్చాత్య దేశాల్లో లాగా మనకు 'లేటరల్ ఎంట్రీ' విధానం లేదు. ప్రస్తుత వయోపరిమితి సడలింపు ఆ విధానంలానే పరిగణించవచ్చని నిరుద్యోగులు వాదిస్తున్నారు. వయోపరిమితి పెంపువల్ల ప్రభుత్వంపై భారం ఉండదని స్పష్టంచేస్తున్నారు. ప్రస్తుతం పెన్షన్ కూడా లేదని, 2004నుంచి కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం అమల్లో ఉందంటున్నారు.